ఆంధ్రజ్యోతి

గూడూరు టౌన్

మంగళవారం, 3 జనవరి 2017

గూడూరు | గూడూరు టౌన్ | గూడూరురూరల్



# పేదల కోసమే 'జన్మభూమి-మాఊరు'




గూడూరు: బాలికా సంరక్షణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం



గూడూరురూరల్: ఉపకార వేతనాలు అందజేస్తున్న బొల్లినేని

**● ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్**

**గూడూరు:** అర్హులైన పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే వేదిక జన్మభూమి- మీ ఊరు కార్యక్రమమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని బొమ్మిరెడ్డి మున్సిపల్ పాఠశాలలో జన్మభూమి-మీ ఊరు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పట్టణంలోని 1, 2 వార్డులకు బొమ్మిరెడ్డి పాఠశాలలో, 3, 4 వార్డులకు జనార్దన్‌రెడ్డి మున్సిపల్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సక్రమంగా పేదలకు అందించడంతోపాటు అర్హులకు పథకాలు వర్తింపజేసేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అధికారులు తూతూ మంత్రంగా కాకుండా చిత్తశుద్ధితో విజయవంతం చేసేలా కృషి చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు అన్ని వివరాలను అందజేయాలన్నారు. అధికారులకు నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. అనంతరం నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను ఐసీడీఎస్ శాఖ జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాల్‌ను ఏర్పాటు చేసి వాటి వినియోగం వలన కలిగే ఉపయోగాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో వెంకటసుబ్బయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం కిరణ్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డి, డీఈ నాగేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, కౌన్సిలర్లు విజయమ్మ, నూర్జహాన్, వాటంబేడు శివకుమార్, ఆర్ఐ ఆశోక్‌వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతం చేయండి

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రతి ఒక్క అధికారి కృషి చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ అధికారిక కార్యక్రమమైనా జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ప్రతి శాఖకు చెందిన అధికారులు పాల్గొనాలన్నారు. జన్మభూమి కార్యక్రమం జరిగే ప్రాంతాలకు చెందిన లబ్ధిదారుల పేర్లను సభలో చదివి వినిపించాలన్నారు. ప్రధానంగా హౌసింగ్ అధికారులు ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలను వెల్లడించాలన్నారు. ప్రజల నుంచి అందుకునే అర్జీలను శాఖల వారీగా ప్రతి రోజు సాయంత్రం తనకు నివేదించాలన్నారు. వీటి ఆధారంగా చేసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తెలపాల్సి ఉంటుందన్నారు. అధికారులు సమన్వయంతో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించి ప్రజలకు చేరువ కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో వెంకటసుబ్బయ్య, అధికారులు నాగేశ్వరరావు, గోపాల్‌రావు, ఉమామహేశ్వరి, వైస్ చైర్మన్ శీలం కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే సీఎం ధ్యేయం

**గూడూరురూరల్:** ప్రజా సంక్షేమమే సీఎం చంద్రబాబునాయుడు ధ్యేయమని ఏఎంసీ చైర్మన్ బొల్లినేని కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొమ్మనేటూరు, కందలి గ్రామాల్లో ఎంపీడీవో భవాని ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం సీఎం కృషి చేస్తున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా జన్మభూమి కార్యక్రమం నిర్వహించి రేషన్‌కార్డులు, పింఛన్లు, విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కొండూరు వెంకటేశ్వర్లురాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని మిట్టాత్మకూరు, పగడాలపల్లి గ్రామాల్లో, తహసీల్దారు సత్యవతి ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు.

## మాళవ్యనగర్, ఇందిరానగర్‌లో నేడు 'జన్మభూమి-మాఊరు'

**గూడూరు:** పట్టణంలోని మాళవ్యనగర్‌లోని సీతమ్మబడిలో 32, 33 వార్డులు, ఇందిరానగర్‌లోని మున్సిపల్ పాఠశాలతో 24, 25 వార్డులకు మంగళవారం జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించనున్నారు. 4న షాదీమంజిల్‌లో 5, 6, 13, 15, 17 వార్డులకు, 5న షాదీమంజిల్‌లో 7, 8, 9, 14, 16 వార్డులకు, 6న వాలయనందపురం మున్సిపల్ పాఠశాలలో 20, 21, 22 వార్డులకు, సీవీసీ పార్కులో 10, 11 వార్డులకు, 7న జానకిరాంపేట మున్సిపల్ పాఠశాలలో 23, 26, 27 వార్డులకు, ఎస్ఎంజీ పాఠశాలలో 12, 18, 19 వార్డులకు, 9న జీఎస్‌రాయల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 28, 29, 30, 31 వార్డులకు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి
గూడూరు టౌన్
శనివారం, 31 డిసెంబరు 2016


## జనవరిలో పాత పద్ధతిలో పింఛన్ పంపిణీ



కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

గూడూరుటౌన్: పింఛనుదారులకు పాత పద్ధతిలో పింఛన్ పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పాతపద్ధతిలో బట్వాడా కేంద్రాల ద్వారా జనవరి 1 నుంచి 3వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేస్తామని, పింఛనుదారులు ఆధార్, పింఛను పాసుపుస్తకం, మొబైల్ నెంబరు తప్పక తీసుకురావాలన్నారు.

## ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో పట్టణాభివృద్ధి

- మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న దేవసేన

గూడూరుటౌన్: ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు 15 కోట్లతో పట్టణాభివృద్ధి చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండాలోని 102 అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించి పలు అంశాలను తీర్మానించారు. కౌన్సిల్ సభ్యులకు పెరిగిన జీతాలకు సంబంధించి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పొనకా దేవసేన, వైస్ చైర్మన్ శీలం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులకు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా రూ.15 కోట్లు మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారాయణకు ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ల దాఖలుకు తుది గడువు నాడు వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో టెండరు దాఖలు చేసుకోలేక పోయారని, దీంతో ఆ పనులకు రీ టెండర్లు నిర్వహించాలని ఇరుపార్టీలకు చెందిన కౌన్సిలర్లు కోరారు. 8 మంది కౌన్సిలర్లు డీసెంట్ నోటీసును చైర్‌పర్సన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, వాటంబేడు, బిల్లు చెంచురామయ్య, బాలిబోయిన రమేష్, నాశిన నాగులు, చోళవరం గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న నక్కలోళ్లు

గూడూరుటౌన్: స్థానిక పూలతోట గిరిజన కాలనీలో ప్రభుత్వం కేటాయించిన మరుగుదొడ్ల నిర్మాణాలు చేసుకుంటుండగా అడ్డుకుంటున్నారని నిరసన తెలుపుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం నక్కలోళ్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఎన్నో ఏళ్లుగా గిరిజన కాలనీలో నివాసముంటున్నామన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా తమకు మరుగుదొడ్లు మంజూరు కాగా వాటిని నిర్మించుకుంటుడగా ఆ ప్రాంతానికి చెందిన ఓ ఆసామి ఈ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టరాదని అడ్డుకుంటున్నారన్నారు. న్యాయం చేయాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు.